

నారాయణపూర్‌లో బతుకమ్మ చీరెలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ నజీర్



ఆచంపల్లిలో చీరెలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ లక్ష్మణ్

# బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలి

గంగాధర, అక్టోబర్ 8: మండలంలోని నారాయణపూర్, ఇస్లాంపూర్, నాగిరెడ్డిపూర్, ఆచంపల్లి, హిమ్మత్‌నగర్ గ్రామాల్లో సర్పంచులు ఆదివారం మహిళలకు బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ, రాష్ట్రంలోని మహిళలు బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్న ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్ చీరెలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మహిళల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలను ప్రవేశపెడుతున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు ఎండీ నజీర్, వడ్లూరి ఆదిమల్లు, పంజాల లక్ష్మి, కొంకటి శంకర్, ఎంపీటీసీ కోలపురం లక్ష్మణ్, వార్డు సభ్యుడు బండారి శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



ఇస్లాంపూర్‌లో బతుకమ్మ చీరెలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ అనిత



హిమ్మత్‌నగర్‌లో చీరెలను పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీనివాస్

# మెగా స్వచ్ఛతా హీ సేవాలో గంగాధర బృందం



స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న మండల బృందం

గంగాధర, అక్టోబర్ 8: కొత్తపల్లి మండలం ఎలగందులలోని ఖిల్లాపై జిల్లా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో మండలానికి చెందిన 200 మంది పాల్గొన్నట్లు ఎంపీడీవో మల్హోత్రా తెలిపారు. అధికారుల ఆధ్వర్యంలో బృందం సభ్యులు ఖిల్లాపై పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో జనార్దన్‌రెడ్డి, పంచాయతీ రాజ్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# కురుమ సంఘం నియోజకవర్గ స్థాయి సమావేశం



సమావేశమైన కురుమ సంఘం సభ్యులు

గంగాధర, అక్టోబర్ 8: గంగాధర మార్కెట్ కమిటీ ఆవరణలో చొప్పదండి నియోజకవర్గ స్థాయి కురుమ సంఘం సమావేశాన్ని సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఒగ్గు మల్లేశం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కురుమ యువజన, ఉద్యోగుల సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా కడారి కుమారస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యముండ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా పబ్బాల ఐలయ్య, ప్రధాన కార్యదర్శిగా అమరగొండ రాజేశం, సంయుక్త కార్యదర్శిగా హనుమాన్, కోశాధికారిగా దయ్యాల తిరుపతి, పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అలాగే, ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా ఈరల్ల విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా సంబ కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా గుంటి రవీందర్, సంయుక్త కార్యదర్శిగా ఎముండ్ల సతీశ్, సహాయ కార్యదర్శిగా పెద్ది రాజమల్లు, కోశాధికారిగా జడ కమలాకర్, కార్యవర్గ సభ్యులుగా వెల్ముల కుమార్, గుంటి సంపత్, బండారి అశోక్, ఎగుర్ల ఐలయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు దానె ఓదెలు, జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి ఐలయ్య, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఎగుర్ల కనకయ్య, మాజీ సర్పంచ్ సంబ లక్ష్మీరాజం, రాష్ట్ర కార్యదర్శి ఎలుకపెల్లి లచ్చయ్య, నియోజకవర్గంలోని సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

గంగాధర, అక్టోబర్ 8: మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామానికి చెందిన గంగాధర వెంకవ్వ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని ఆదివారం సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి పరామర్శించి, రూ. 5 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు చొక్కాల శ్రీనివాస్, దశరథం, బుర్ర అజయ్, శ్యామ్, సాయి, కొలకాని జగన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

ముకరంపుర, అక్టోబర్ 8: నగరంలోని టౌన్–2 ఏడీఈ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు నిర్వహించనున్నట్లు టీఎస్ ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ ఎన్వీ వేణుగోపాలచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోకల్ కోర్టులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం, వోల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు, వాడకం కంటే హెచ్చు మొత్తంతో గల బిల్లులు, కేటగిరి మార్పు, సర్వీసు రద్దుకు సంబంధించి విద్యుత్ వినియోగదారులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందించవచ్చునని తెలిపారు. లోకల్ కోర్టులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## ముదిరాజ్ సభకు తరలిన నాయకులు

గంగాధర, అక్టోబర్ 8: హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన ముదిరాజ్‌ల ఆత్మీయ సభకు మండల నాయకుడు తూడి లచ్చయ్య ఆధ్వర్యంలో మండలంలోని ముదిరాజ్ కులస్తులు తరలివెళ్లారు. కాగా, మధురానగర్ చౌరస్తా నుంచి బస్సు బయలుదేరగా జెండా ఊపి ప్రారంభించారు.

## విశ్రాంత ఉద్యోగికి సత్కారం

రామడుగు, అక్టోబర్ 8: మండలంలోని వెదిర గ్రామానికి చెందిన విశ్రాంత ఎల్‌ఐసీ ఉద్యోగి దాసరి శంకరయ్యను స్థానిక సమన్విత సహాయ సమితి సభ్యులు ఆదివారం శాలువాతో సత్కరించారు. విధి నిర్వహణలో శంకరయ్య అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ ధర్మపురి శాఖ మేనేజర్ బీరెడ్డి ప్రేమ్ సాగర్ రెడ్డి, సమన్విత సహాయ సమితి వెదిర అధ్యక్షుడు గాజుల ఆనందం, వీడీసీ చైర్మన్ నాగుల రాజశేఖర్ గౌడ్, రామడుగు సహకార సంఘం డైరెక్టర్ ఏరెడ్డి కొమురారెడ్డి, సమన్విత సహాయ సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా



నాగిరెడ్డిపూర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- మధురానగర్‌లో వ్యాపారులతో ఆత్మీయ సమ్మేళనం

గంగాధర, అక్టోబర్ 8: వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మధురానగర్ చౌరస్తాలోని వ్యాపారులతో ఆదివారం కురిక్యాల శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వ్యాపార, వాణిజ్య పరంగా అభివృద్ధి చెందుతున్న గంగాధరను మున్సిపాలిటీ చేస్తామన్నారు. మధురానగర్‌లో ప్రజల సౌకర్యార్థం సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామని, రైతులు, వ్యాపారుల కోసం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు చేస్తామన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నానని, ఎన్నికల సమయంలో వచ్చి పోయే వారిని ప్రజలు నమ్మవద్దని, స్థానికంగా ఉంటూ అభివృద్ధి చేస్తున్న తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

**సీఎం కేసీఆర్‌తోనే గ్రామ స్వరాజ్యం**

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. నాగిరెడ్డిపూర్‌లో వైకుంఠ ధామం, సీసీ రోడ్డు, హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడా సామగ్రిని స్థానిక క్రీడాకారులకు, బతుకమ్మ చీరెలను మహిళలకు పంపిణీ చేశారు. పల్లె ప్రగతితో గ్రామాల్లో సమూల మార్పులు వచ్చినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా క్రీడా ప్రాంగణాలకు సామగ్రిని, మహిళలకు బతుకమ్మ చీరెలను పంపిణీ చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కురిక్యాల సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ లోకిని ఎల్లయ్య, ఆత్మ చైర్మన్ తూం మల్లారెడ్డి, సర్పంచులు పంజాల లక్ష్మి, వేముల దామోదర్, నాయకులు వేముల అంజి, రామిడి సురేందర్, రేండ్ల శ్రీనివాస్, వ్యాపారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ యూత్ ఉపాధ్యక్షుడిగా గణేశ్



గణేశ్‌కు నియామక పత్రం అందజేస్తున్న మండలాధ్యక్షుడు అనిల్

గంగాధర, అక్టోబర్ 8: ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బందారపు అజయ్ సూచనల మేరకు పార్టీ యువజన విభాగం మండల ఉపాధ్యక్షుడిగా ర్యాలపల్లి గ్రామానికి చెందిన రాగ్గల గణేశ్‌ను నియమించినట్లు యువజన విభాగం మండలాధ్యక్షుడు సుంకె అనిల్ తెలిపారు. ఈ మేరకు మండలంలోని బూరుగుపల్లిలో ఆదివారం గణేశ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. కాగా, తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే రవిశంకర్, యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు అజయ్‌కుమార్, మండలాధ్యక్షుడు సుంకె అనిల్‌కు, బీఆర్‌ఎస్ మండల నాయకులకు గణేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ర్యాలపల్లి ఎంపీటీసీ అట్ల రాజిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ బెజ్జంకి కళ్యాణ్, బీఆర్‌ఎస్ యువజన విభాగం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి లంక హరిబాబు, నాయకులు కొలకాని శంకరయ్య, బెజ్జంకి ప్రశాంత్, గంగాధర శ్రీకాంత్, పిల్లి మల్లేశం, తునికి కమలాకర్, రాగ్గల కనకరాజు, గుర్రాలగొండి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన వారికి సత్కారం



ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న శ్రీగంధె సంతోష్, తదితరులు

చొప్పదండి, అక్టోబర్ 8: కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన జంజూరి లహరి, పులి మాధవిని స్థానిక గీతా విద్యాలయం హైస్కూల్లో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించారు. తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్రీగంధె సంతోష్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మనోహర్, గౌరవాధ్యక్షుడు ఆనంద్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజేందర్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గంగారం, పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి సతీశ్‌కుమార్, జగిత్యాల జిల్లా ఈసీ మెంబర్ రమేశ్, కోచ్‌లు శ్రీజ, నాగమణి, కావ్య, అంజలి, సిరి, రమ్య పాల్గొన్నారు.